నమోదులో పొరపాట్లకు తావివ్వొద్దు: కలెక్టర్


వివరాల నమోదును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నర్సాపూర్, న్యూస్‌టుడే: డిజిటల్ క్రాప్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. నర్సాపూర్‌లోని డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివరాల నమోదును పరిశీలించారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, అంజనేయులు, ఎంపీడీవో మధులత, నాగేశ్వర్‌రావులను సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సంప్రదాయాలకు ప్రతీకగా..

మెదక్: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, వారసత్వానికి ప్రతీక అని, ఈ సంబరాలను బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. బతుకమ్మ జరుపుకునే అన్ని ప్రాంతాల వద్ద విద్యుత్తు, తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలతో పాటు చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించాలని ఆదేశించారు. కలెక్టరేట్ ఆవరణలో సంప్రదాయ వంటకాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు, 2కె రన్ నిర్వహించాలన్నారు.

కాంగ్రెస్, భారాస బొమ్మాబొరుసు లాంటివి: ఎంపీ

జగదేవపూర్, కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాజెక్టుల నిర్మాణంలో పేరుతో వరకు అవినీతిలో కూరుకుపోయిన భారాస 10 ఏళ్లలో ప్రజల విశ్వాసం కోల్పోతే, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక 10 నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. కాంగ్రెస్, భారాసలు బొమ్మాబొరుసు లాంటివని వ్యాఖ్యానించారు. జగదేవపూర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో భారాస సీనియర్ నాయకుడు బుద్ధ మహేందర్‌గుప్తా, ఆయన సతీమణి, మాజీ సర్పంచి బుద్ధ జ్యోతి భాజపాలో చేరారు. ఎంపీ మాట్లాడుతూ... దేశంలో భాజపా ప్రభంజనం కొనసాగుతోందని చెప్పారు. త్వరలోనే అగ్రరాజ్యాల జాబితాలో భారత్ చేరనుందని ఎంపీ అన్నారు. విశ్వశాంతి మోదీతోనే సాధ్యం అవుతుందని అనేక దేశాధినేతలు చెబుతున్నారన్నారు. భాజపాలో కష్టపడిన నాయకులకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు.


పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, న్యూస్‌టుడే: సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సక్రమంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 463 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు 93, దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రాలు 370 ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యంపై రూ.500 బోనస్ ఇస్తుందని.. 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి జమ అవుతుందన్నారు. ప్రతి ధాన్యం బస్తాపై కేటాయించిన కోడ్ ఉండాలని, దొడ్డు రకానికి పచ్చదారం, సన్న రకానికి ఎర్ర దారం ఉండాలని ఆదేశించారు. బోనస్ పట్ల అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరికృష్ణ, అధికారి సురేష్ రెడ్డి, తూనికలు, కొలతల శాఖ అధికారి సుదాకర్, డీసీవో కరుణ పాల్గొన్నారు.

చెరువుకు చేరని చేపలు

అదును దాటినా జాడలేని విత్తనం



న్యూస్‌టుడే-మెదక్: జిల్లాలోని సాగు నీటి వనరుల్లో చేప పిల్లలను విడిచిపెట్టే కార్యక్రమం ఇంకా చేపట్టలేదు. ఈ ప్రక్రియను ప్రభుత్వం జూన్-ఆగస్టు నెలల మధ్యలో పూర్తి చేసేది. గతేడాది ఈ సమయానికి నీటి వనరుల్లో చేప విత్తనం వేయగా.. ఈ ఏడాది ఇప్పటికీ ఇంకా ఏజెన్సీ ఖరారు కాకపోవడం గమనార్హం. ఇప్పటికే ఆయా జిల్లాలో చేప విత్తనం పంపిణీ కొనసాగుతుండగా.. నీటి వనరులు నిండుగా ఉన్న మెతుకుసీమలో చేపల విడుదలపై మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' కథనం..

జిల్లాలో ఇలా...

- నీటి వనరులు: 1,654
- మత్స్య సహకార సంఘాలు: 284
- సభ్యులు: 15,723
- చేప విత్తనం లక్ష్యం: 5.25 కోట్లు
- కుదించిన లక్ష్యం: 2.62 కోట్లు

ఎవరూ ముందుకు రాక

గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు ఉచితంగా చేప పిల్లల పంపిణీ చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో ఈసారి 5.25 కోట్ల విత్తన చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు వాటి పంపిణీ కోసం మత్స్యశాఖ అధికారులు గత జులై, ఆగస్టు నెలలో టెండర్లు పిలిచారు. మూడు సార్లు పిలవగా.. గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. గతేడాది వదిలిన చేప పిల్లలకు సంబంధించిన బిల్లులు ఇంకా గుత్తేదారులకు చెల్లించలేదు. పెండింగ్ బిల్లులు అందజేస్తేనే టెండర్‌లో పాల్గొంటామని పట్టుబట్టారు.

టెండర్లు తిరస్కరణ..

చివరకు షార్ట్ టెండర్లు నిర్వహించగా నలుగురు దాఖలు చేశారు. అవి కూడా తిరస్కరణకు గురికావడం గమనార్హం. ఒకరివి సరైన డాక్యుమెంట్లు లేక తిరస్కరించగా... మంచిర్యాల, కరీంనగర్ జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుత్తేదారుల ఫాంలను జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కానీ ఈ ముగ్గురి ఫాంలలో చేప విత్తనం లేవు. దీంతో వీరి టెండర్లను సైతం రద్దు చేశారు. గతేడాది జులై, ఆగస్టు నెలలో చేప విత్తనం పంపిణీ చేశారు. ఈ ఏడాది నీటి వనరులు నిండుగా ఉన్నా ఇంకా పంపిణీ జాడ కనబడటం లేదు. ఇప్పటికే ఆరేడు జిల్లాల్లో చేప విత్తనాల పంపిణీ పూర్తయింది. ఇంకా జిల్లాలో టెండరు ఖరారే కాకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అదును దాటిందని... రెండు నెలలు ఆలస్యం కావడంతో... ఒకవేళ విత్తనం వేసినా సకాలంలో చేతికి అందవని మత్స్యకారులు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



షార్ట్ టెండర్‌లో నలుగురు దాఖలు చేశారు. అందులో ఒకటి ఆరంభంలోనే తిరస్కరణకు గురికాగా, మరో మూడింటికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. వారి వద్ద విత్తనం లేవు. దీంతో వాటిని రద్దు చేసి, ఉన్నతాధికారులకు నివేదించాం.

మల్లేశం, జిల్లా మత్స్యశాఖ అధికారి

పూలు పేర్చి.. బతుకమ్మను చేసి..


మెదక్ వీర హనుమాన్ కాలనీ వేడుకలో మహిళలు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా అట్ల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం మెదక్ పట్టణ కోదండ రామాలయం, బాలాజీ మఠం, వీర హనుమాన్, వాసవి నగర్, హౌసింగ్ బోర్డ్, నవాబుపేట, పిట్లంబేస్ తదితర కాలనీలలో మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. వీర హనుమాన్ కాలనీలో మహిళలు ఒకే రంగు చీరలు ధరించి సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

పరిహారం చెల్లించాలని ఆందోళన


చేగుంటలో నిరసన తెలుపుతూ..

చేగుంట: ప్రభుత్వం తమ భూములను లాక్కొని పరిశ్రమకు అప్పగించిందని.. పరిహారం మాత్రం ఇవ్వలేదని చేగుంటలో దళితులు మంగళవారం గాంధీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఆందోళన చేశారు. విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. చేగుంట సమీపంలో ఉన్న ఓ పరిశ్రమకు అధికారులు తమ 13 ఎకరాల భూములను అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని, లేదంటే ఆత్మహత్యకు పాల్పడతామని అన్నారు. న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని శివరాజు తెలిపారు.

వనదుర్గమ్మకు బోనం


బోనం ఎత్తుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, భక్తులు


గోకుల్ షెడ్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం ముదురు నీలం వస్త్రాలంకరణలో కాత్యాయని(దుర్గాదేవి)గా అమ్మవారు దర్శనమిచ్చింది. ఆలయం వద్ద వరద ప్రవాహం ఉండడంతో రాజగోపురంలో నిత్య పూజలు కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాల్గొని బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో చంద్రశేఖర్, మెదక్ పురపాలిక వైస్ ఛైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్, మాజీ ఎంపీపీ చందనారెడ్డి తదితరులున్నారు.

అమ్మవారికి లక్ష పుష్పార్చన

పాపన్నపేట: కొడుపాకలో మంగళవారం అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


కొడుపాకలో అమ్మవారికి పూజలు చేస్తున్న మాధవానంద స్వామిజీ


వెల్దుర్తి వెంకటేశ్వర ఆలయంలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న ఆవుల రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: దుర్గామాత చల్లని చూపులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం వెల్దుర్తి వెంకటేశ్వర ఆలయంలో దుర్గామాతను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు హనుమన్నగారి నరేందర్‌రెడ్డి, కరుణకర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు


సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో గోవింద్

శివ్వంపేట, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ సహాయ సంచాలకురాలు సంధ్యారాణి అన్నారు. శివ్వంపేట రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్ పామ్ పంటకు కోతులు, అడవి పందుల బెడద ఉండదని.. ఎకరా వరి పండించడానికి సరిపోయే నీటితో 5 ఎకరాలు సాగు చేయవచ్చన్నారు. ఏడాదికి ఎకరాకు రూ.1.20లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, లీవ్ ఫామ్ రిసోర్సెస్ కంపెనీ ప్రతినిధి కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మెదక్, న్యూస్‌టుడే: ప్రతి రెండు, మూణ్నెళ్లకోసారి ఉద్యోగ సంఘాలతో గ్రీవెన్స్ సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగులు, పీహెచ్‌సీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్యాంసుందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని వేడుక మందిరంలో సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి శ్రీరాంకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రెండేళ్లుగా నిధులు రావడం లేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణకు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజిరెడ్డి, విజయేందర్, మదన్ మోహన్, నరేందర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, షఫి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్‌రావు, మేరీ, లిల్లీ గ్రేస్ పాల్గొన్నారు.

బడి ఖర్చులకు నిధులు

- జిల్లాకు మొదటి విడతగా రూ.1.28కోట్లు విడుదల

న్యూస్‌టుడే, వేగుంట: సర్కారు పాఠశాలలకు మొదటి విడత నిర్వహణ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. గత ఏడాది జులైలో మొదటి విడత.. 2024 మార్చిలో రెండో విడత విడుదల చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి పాఠశాల ప్రారంభమైన మూడు నెలలకు మొదటి విడతగా 50శాతం నిధులు మంజూరు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. వాటిని పాఠశాలల ఖాతాలో జమచేశారు. నిధులను బడుల వసతుల కల్పనకు, క్రీడలకు వినియోగించనున్నారు. వీటిని అమ్మ ఆదర్శ కమిటీ తీర్మానంతోనే వినియోగించాల్సి ఉంటుంది.

జిల్లాలో పాఠశాలల వివరాలు

- ప్రాథమిక: 623
- ప్రాథమికోన్నత: 128
- జడ్పీ ఉన్నత: 146
- ఆదర్శ: 7

మొదటి విడత మంజూరైన నిధులు: రూ.1,28,12,500

విద్యార్థుల సంఖ్య ఆధారంగా

జిల్లాలోని పాఠశాలల నిర్వాహణకు గతంలో ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ నిధులు వేర్వేరుగా వచ్చేవి. మూడేళ్లుగా రెండు కలిపి సమగ్ర శిక్షగా మార్చారు. విద్యార్థుల సంఖ్యతో పాటు సామాజిక వర్గం ప్రాతిపదికగా బడులకు గ్రాంట్లు కేటాయిస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలలకు 30 లోపు విద్యార్థులు ఉన్నవాటికి రూ.10 వేలు, వందలోపు ఉంటే రూ.25వేలు, 250 ఉంటే రూ.50 వేలు, వేయి లోపు ఉంటే రూ.75వేలు, వెయ్యికిపైగా విద్యార్థులుంటే రూ.లక్ష వరకు వస్తాయి. క్రీడల నిర్వహణకు కూడా నిధులు విడుదల అయ్యాయి. జిల్లాకు రెండు విడతలుగా రూ.2,56,25,000 మంజూరు చేస్తుంటారు. ఇందులో మొదటి విడతగా సగం విడుదల చేశారు. రెండో విడత 2025 మార్చిలో విడుదల చేసే అవకాశం ఉంది.


నిధులతో ఉపయోగం

పాఠశాలకు నిధులు లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చాక్‌పీస్‌లు, డస్టర్ల కొనుగోలు, స్టేషనరీ వంటి వాటికి ఇబ్బందిగా ఉండేది. ఉపాధ్యాయుల ఇబ్బందులను గుర్తించిన విద్యాశాఖ ఈ విద్యాసంవత్సరం నిధులను విడుదల చేసింది. పాఠశాలలకు ఉచిత విద్యుత్తు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వాటిని చెల్లించే సమస్యలేకుండా పోయింది.

వీటికి వినియోగించాలి

పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీల సంయుక్త ఖాతాలో నిధులు జమ చేశారు. కమిటీ తీర్మానం మేరకు వాటిని ఖర్చు చేయాలి. పాఠశాల మరమ్మతులు, శుభ్రం చేసుకోవటం, ప్రయోగ పరికరాలు, స్టేషనరీ, పత్రికలు, పాఠశాల సమావేశాల నిర్వహణ, జాతీయ పండగలు, కంప్యూటర్లు, ప్రొజెక్టర్ల నిర్వహణ, అంతర్జాలం, డిజిటల్ తరగతులకు ఖర్చు చేసుకోవచ్చు. నిధుల్లో 10శాతం స్వచ్ఛ కార్యక్రమాలకు తప్పకుండా వినియోగించాలి.

రికార్డుల్లో నమోదు చేయాలి:



రాధాకిషన్, డీఈవో

పాఠశాలలకు మంజూరైన నిధులను వాటికే ఉపయోగించాలి. ప్రస్తుతం వాటిని పాఠశాల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. గతంలో మాదిరిగానే ఈసారి తొందరగానే నిధులు విడుదలయ్యాయి. వినియోగించిన నిధులను రికార్డుల్లో నమోదు చేయాలి.

నేడు విద్యాధరిలో అక్షరాభ్యాసాలు

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. ఎంపీ రఘునందన్‌రావు అమ్మవారిని దర్శించుకొని పూజించారు. బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం మూల సందర్భంగా విశేష పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు, లక్ష పుష్పార్చన జరగనున్నాయి.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

టేక్మాల్, న్యూస్‌టుడే: మండల పరిధి కాజులూరు, ధనూర, టేక్మాల్ విద్యుత్తు కేంద్రాల పరిధిలో బుధవారం విద్యుత్తు సరఫరా ఉండదని పాపన్నపేట ఏడీఈ బాబుమోహన్ తెలిపారు. ఉపకేంద్రాల పరిధిలో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ పొలాలకు సరఫరా ఉండదని, గ్రామాలకు సింగిల్ ఫేజ్ విద్యుత్తు సరఫరా ఉంటుందన్నారు.

కొంతాన్‌పల్లిలో బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనాలతో పోలీసులు, రెవెన్యూ అధికారులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: విజిలెన్స్ అధికారులు దాడి చేసి రైస్‌మిల్లు వద్ద బియ్యం స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లిలోని శ్రీఆంజనేయ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లు సమీపంలో సోమవారం రాత్రి 60 బస్తాల బియ్యం, 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు, తహసీల్దార్ ప్రభాకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సాంబశివరావు, డీటీసీఎస్ ప్రణీత రెడ్డి, శివ్వంపేట ఆర్ఐ సునీల్ పంచనామా నిర్వహించారు. 60 బస్తాలు ఏ బియ్యం అనేది నిర్ధరించాల్సి ఉందన్నారు. శివ్వంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డికి ఫిర్యాదు చేశామని డీటీసీఎస్ ప్రణీత రెడ్డి తెలిపారు. బియ్యం తరలించిన తూప్రాన్ గ్రామానికి చెందిన మన్నెం నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మిగతా బియ్యం పరీక్షలో వచ్చే సమాచారం మేరకు రైస్‌మిల్లు యాజమాన్యంపై చర్యలు ఉంటాయని తెలిపారు.

లాభాల డ్రాగన్

32 రకాల ప్రదర్శన ● సాగుకు ప్రోత్సాహం



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఉద్యానశాఖ అధికారులు, రైతులు

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ



డ్రాగన్ ఫ్రూట్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. జిల్లాలో సాగు విస్తీర్ణం తక్కువ, ధర ఎక్కువ కావడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు సంగారెడ్డిలోని డా.కొండా లక్ష్మణ్ బాపూజీ ఫల పరిశోధన కేంద్రం శ్రీకారం చుట్టింది. మంగళవారం డ్రాగన్ ఫ్రూట్ మేళా నిర్వహించి అవగాహన కల్పించింది. మేళాలో 32 రకాలు ప్రదర్శించారు. రెడ్ స్కిన్‌డ్, రాయల్ పింక్, బ్లడ్‌మారి, మిస్టర్‌వో తదితర రకాలున్నాయి.

5వేల ఎకరాల్లో సాగు లక్ష్యం..

సంగారెడ్డి జిల్లాలో డ్రాగన్ సాగుకు మంచి అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సంగారెడ్డి, కొండాపూర్, జహీరాబాద్‌లో 142 ఎకరాల్లో పండిస్తున్నారు. మేళాలో పలువురు రైతులు వారి అనుభవాలు వివరించారు. జిల్లాలో తొలుత 5వేల ఎకరాల్లో సాగు చేసేలా ఉద్యానశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



రైతులకు అవగాహన కల్పించేందుకే..

– నీరజ ప్రభాకర్, ఉపకులపతి, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం

మార్కెట్లో పండు ధరలు ఎక్కువగా ఉన్నాయి. సామాన్యులకు అందుబాటులోకి రావాలంటే జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగాలి. ఈ ఉద్దేశంతోనే ఫల పరిశోధన కేంద్రంలో మేళా నిర్వహించాం. రైతులు అనుభవాలు వివరించారు. చక్కెర శాతం తక్కువగా ఉండడంతో మధుమేహులూ తినొచ్చు.

ఎకరాకు పది లక్షల పండ్లు

– డా.హరికాంత్, సీనియర్ శాస్త్రవేత్త, ఎఫ్ఆర్ఎస్

పంటపై రైతులకు ఇప్పుడిప్పుడే అవగాహన కలుగుతోంది. జిల్లాలో 150 ఎకరాల్లో డ్రాగన్ పంట సాగవుతోంది. ఒక్కో పండు రూ.100- 150 ఉంటుంది. జూన్- ఆగస్టు మధ్యలో దిగుబడి వస్తుంది. ఎకరాకు 10 లక్షల పండ్లు పండించొచ్చు. పంట ఎలా సాగు చేయాలో రైతులకు వివరించాం.

పాడైనా నష్టం లేదు..

డ్రాగన్ పండ్లు విక్రయం కాకున్నా పారేయాల్సిన అవసరం లేదు. పాడైన వాటితోనూ వివిధ రకాల వస్తువులు తయారు చేయొచ్చని ప్రదర్శనలో చూయించారు. సబ్బులు, పాపడ్, గుల్మన్, క్యాండి, లిప్ బామ్, చిప్స్‌ను ఎలా తయారు చేయొచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు.



మేళాలో ప్రదర్శించిన ఉద్యాన పంటల విలువ ఆధారిత వస్తువులు



అవగాహన కల్పించారు.. ఇక సాగు చేస్తా..

ఇప్పటి వరకు ఎన్నో పంటలు సాగు చేశా. పెట్టుబడి ఎక్కువగా పెడుతున్నా ఆశించిన లాభాలు మాత్రం రావడం లేదు. మేళాకు రావడంతో డ్రాగన్ ఎలా సాగు చేయాలో తెలుసుకున్నా. ఈసారి పండించాలని నిర్ణయించుకున్నా.

– విశ్వప్రసాద్, రైతు, మారేపల్లి

65 రకాలు పండించా..



65 రకాల పండ్లు పండించా. ఏడాదిపాటు కష్టపడితే రెండేళ్ల తరవాత కోతకు వస్తుంది. పెట్టుబడికి రెండింతల లాభాలొస్తాయి. దీనిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది. అధికారులు ప్రోత్సహిస్తే చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– రమేశ్‌రెడ్డి, రైతు, రంజోల్, జహీరాబాద్

గతేడాది రూ.7 లక్షల ఆదాయం



మూడేళ్లుగా రెండెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పండిస్తున్నా. ఎకరాకు రూ.3.50 లక్షల పెట్టుబడి పెట్టా. గతేడాది రూ.7 లక్షల ఆదాయం వచ్చింది. ఈసారి రూ.12 లక్షలు ఆర్జించా. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అన్నదాతలను ప్రోత్సహించాలి.

– మదన్ మోహన్‌రెడ్డి, రైతు, తెర్పోల్



పతకాలు, ప్రశంసాపత్రాలతో మెదక్ జట్టు క్రీడాకారిణులు, అదనపు పాలనాధికారి వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

రాష్ట్ర ఫుట్‌బాల్ ఛాంపియన్ మెదక్



ఫైనల్‌లో తలపడుతున్న మెదక్, రంగారెడ్డి జిల్లాల క్రీడాకారిణులు

మెదక్ టౌన్: పాఠశాల క్రీడ సమైఖ్య(ఎస్‌జీఎఫ్) 68వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 బాలికల ఛాంపియన్‌గా మెదక్ జట్టు నిలిచింది. గత మూడు రోజుల నుంచి మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం, వెస్లీ పాఠశాల మైదానంలో కొనసాగుతున్న ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. లీగ్ దశ నుంచి అత్యంత ప్రతిభ కనబర్చిన మెదక్, రంగారెడ్డి జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించాయి. రంగారెడ్డి-1, మెదక్-2 పాయింట్లు సాధించడంతో ఛాంపియన్‌గా ప్రకటించారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు

క్రీడలపై దృష్టి పెట్టి రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ... మెదక్ ప్రథమ, రంగారెడ్డి ద్వితీయ, నిజామాబాద్ తృతీయ స్థానాల్లో నిలిచాయన్నారు. అనంతరం విజేతలకు డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. పోటీల కోఆర్డినేటర్ నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసరావు, పీడీలు ప్రతాప్‌సింగ్, మాధవరెడ్డి, రవి, సత్యం పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా చదువుల తల్లి



ప్రసిద్ధ వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం విద్యా సరస్వతి అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. - న్యూస్‌టుడే, వర్గల్

కమనీయ రూపం.. కాత్యాయనీ అవతారం

వికారాబాద్ వైభవలక్ష్మి ఆలయంలో మంగళవారం అమ్మవారు కాత్యాయనీ దేవిగా (గాయత్రీ దేవి)గా దర్శనమిచ్చారు. అమ్మ రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. - న్యూస్‌టుడే, వికారాబాద్ మున్సిపాలిటీ



రాష్ట్ర స్థాయి ఖోఖో బాలికల జట్ల ఎంపికలు



నర్సాపూర్: నర్సాపూర్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ఖేలో ఇండియా ఖోఖో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాలికల ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. రెండు విభాగాల్లో అయిదుగురు చొప్పున ఎంపిక చేశారు. వారు ఈనెల 9న తేదీన నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా ఎంపిక పోటీల్లో పాల్గొంటారని [illegible]. కన్వీనర్ మహేందర్‌రావు, సభ్యులు పోచప్ప, నాగరాజు, నర్సాపూర్ బాలుర ఉన్నత పాఠశాల పీడీ శ్రీకాంత్‌గౌడ్ సమక్షంలో ఎంపిక పోటీలు నిర్వహించారు.

చేతివృత్తులకు పునరుజ్జీవం

పీఎం విశ్వకర్మ పథకంతో స్వయం ఉపాధికి భరోసా

న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం

పోటీ ప్రపంచంలో గ్రామీణ వడ్రంగులు తయారు చేసే సాంప్రదాయ వస్తువులకు మనుగడ లేక ఆదరణ కరవై అనేక మంది వృత్తిని వదిలేసి ఇతర రంగాల వైపు వెళుతున్నారు. యంత్రాలతో పోటీ పడలేక గ్రామీణ వేద విశ్వకర్మలు నిత్యం జీవనపోరాటం చేస్తున్నారు. ఇలాంటి వారికి ఉచితంగా ఆధునాతన నైపుణ్య శిక్షణ, ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహించేందుకు అందుబాటులోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వ పథకమే పీఎం విశ్వకర్మ.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు..

ఈ పథకంలో దాదాపు 18 రకాల సాంప్రదాయ కళాకారులు, చేతివృత్తుల వారికి ఉచితంగా నైపుణ్య శిక్షణ అందించి వారు స్వయం ఉపాధి పొందేలా కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తోపాటు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత శాఖ అధికారులు కొందర్ని ఎంపిక చేస్తారు. వారిని బృందాలుగా విభజించి స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలకు పంపుతారు. అక్కడ శిక్షకులు ఆయా రంగాలపై పాఠాలు బోధించడంతోపాటు ఆధునాతన నైపుణ్య శిక్షణ అందిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రమాణపత్రంతోపాటు రోజుకు రూ.500 చొప్పున ఉపకార వేతనం అందిస్తారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎం విశ్వకర్మ శిక్షణ కింద ఎంపికైన 33 మంది మొదటి బ్యాచ్ అభ్యర్థులకు ఆధునాతన వడ్రంగి నైపుణ్య శిక్షణ విజయవంతంగా పూర్తయింది. మరో బ్యాచ్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. పీఎం విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే రూ.15 వేల టూల్ కిట్ అందిస్తారు. సొంతంగా వ్యాపారం చేసుకోవాలని భావిస్తే పీఎం విశ్వకర్మ ప్రమాణపత్రం ఆధారంగా రూ.1- 3 లక్షల వరకు బ్యాంకుల లోన్ సదుపాయం కల్పించనున్నారు. దీంతో విశ్వకర్మల జీవితాల్లో వెలుగులు నింపే ఉద్దేశంగా ఎవరికైనా ఎంతో ఉపయోగపడుతుంది.



కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శిక్షణ

సద్వినియోగం చేసుకోండి..

-వెంకటరమణ, ప్రిన్సిపల్, ఐటీఐ కళాశాల, కుకునూరుపల్లి

పీఎం విశ్వకర్మ శిక్షణతో స్వయం ఉపాధితో స్థిరపడాలనుకుంటున్న వారికి ఉపయోగపడుతుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పీఎం విశ్వకర్మ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సొంతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకుల రుణ సదుపాయం కల్పిస్తాం.



తయారు చేసిన కళాకృతులు

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరంలో నిజాం కాలంలో నిర్మించిన చెరువు, పరిసరాలు ప్రజలకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. ఈ చెరువును 1891లో నిర్మించారు. నిండుగా, అందమైన పరిసరాలతో కూడిన ఈ ప్రాంతానికి చుట్టుపక్కల మండలాల ప్రజలు సెలవు రోజుల్లో వస్తుంటారు. ఇది 5,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందిస్తోంది. - న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం



కొండల మధ్య చెరువు.. ఆహ్లాదానికి నెలవు

చారిత్రక వైభవం.. భవానీమాత ఆలయం



న్యూస్‌టుడే, జహీరాబాద్: దసరా అంటేనే నవరాత్రులు గుర్తుకొస్తాయి. అమ్మవారిని పూజించటం ఈ పండగ ప్రత్యేకత. తుల్జాభవానీ అమ్మవారు వెలిసిన ఆలయం అనగానే మహారాష్ట్రలోని తుల్జాపూర్ అని అందరికీ తెలుసు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఖాన్‌జమాల్‌పూర్(భవానమ్మపల్లె)లో కొలువైన తుల్జాభవానీ మాత ఆలయానికి అంతటి చరిత్ర ఉందని పూర్వీకులు చెబుతున్నారు. రాష్ట్ర సరిహద్దులోని ఈ గ్రామంలో దాదాపు 800 ఏళ్ల కిందట ఛత్రపతి శివాజీ మహారాజ్ ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు తెలిపారు. యుద్ధానికి వెళుతూ జహీరాబాద్‌కు 15 కి.మీ. దూరంలోని ఖాన్‌జమాల్‌పూర్‌లో సేదతీరారని, విజేతగా వస్తే అమ్మవారి ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నారని చరిత్ర చెబుతోంది. ఆయన విజయం సాధించాక ఆలయం నిర్మించారని తెలుస్తోంది.



ఆలయంలో కొలువైన అమ్మవారు

చెక్కుచెదరని మెట్ల బావి..: ఆలయం చుట్టూ ప్రహరీ, కొంత దూరంలో కందకం, ప్రధాన ద్వారం నిర్మించారు. ఆలయం పక్కనుంచి లోతైన సొరంగ మార్గమున్న ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. గుడి పక్కనే ఎర్ర రాయితో నిర్మించిన మెట్ల బావి ఇప్పటికీ చెక్కుచెదరలేదు. శిథిలావస్థకు చేరుతున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ప్రతి మంగళ, శుక్ర వారాలతోపాటు దసరా, దీపావళి, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో భక్తులు వస్తుండటంతో ఏడాదిపాటు ఆలయం సందడిగా మారుతోంది. దసరా పండగకు భక్తులు భారీగా తరలి రానుండటంతో ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మరింత అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

12 ఏళ్లుగా పాదయాత్ర..: ఛత్రపతి శివాజీ నిర్మించిన ఆలయ ప్రాధాన్యాన్ని వివరించేందుకు 12 ఏళ్లుగా ఈ ప్రాంతంలోని యువకులు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పరిసర గ్రామాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏటా దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని పురాతన భవానీమాత ఆలయం నుంచి ఖాన్‌జమాల్‌పూర్ భవానమ్మపల్లె వరకు పాదయాత్ర చేస్తుంటారు. ఈనెల 10న ఉదయం పాదయాత్రకు ఏర్పాట్లు చేశారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై ప్రచార కార్యక్రమాలు



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బాధ్యులు

మెదక్, న్యూస్‌టుడే: గ్రామాల్లో కులాల మధ్య ఆధిపత్య పోరు సమాజంలో అంతరాలు పెంచేలా ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలిమెల రాజేశ్వర్ అన్నారు. మంగళవారం వేదిక బాధ్యులు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతాల కంటే మారుమూల పల్లెల్లో మూఢనమ్మకాలు అధికంగా ఉన్నాయన్నారు. రామాయంపేట మండలం క్యాతిరెడ్‌పల్లిలో ఇటీవల దాయాదుల మధ్య నెలకొన్న గొడవల కారణంగా ముత్యవ్వను సజీవ దహనం చేశారన్నారు. ఈ ఘటనపై డీజీపీ, కలెక్టర్‌ను కలిసి ఆయన సూచన మేరకు దసరా తర్వాత జిల్లాలో పోలీస్, రెవెన్యూ శాఖల సహకారంతో ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూఢ నమ్మకాలను నిర్మూలించేలా ప్రచార కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్ర బాధ్యులు పద్మ, మహేందర్, వెంకట్ రమణారెడ్డి, పాల్‌రాజ్, వరప్రసాద్, నాగభూషణం, జిల్లా కార్యదర్శి దేవ్లా పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు లింగమయ్యగౌడ్ మృతి



జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, [illegible] లింగమయ్యగౌడ్ (96) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని ఆయన జైలుపాలయ్యారు. కర్ణాటక గుల్బర్గా జైలులో 25 రోజులున్నారు. 50 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల్లో అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణ చేతుల మీదుగా రాష్ట్రపతి భవనంలో సత్కారం పొందారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

నర్సాపూర్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ మండలంలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాలు.. బ్రాహ్మణపల్లికి చెందిన గుండే కరుణాకర్(45) కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఏడాది క్రితం పెద్దకూతురు వివాహం చేశాడు. పెళ్లికి అయిన అప్పు ఎలా తీర్చాలని తరచూ ఆవేదన చెందేవాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పిల్లలు వచ్చేసరికి చనిపోయాడు. భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

మద్యం మత్తులో మరొకరు...

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్‌కాలనీలో అద్దెకు ఉంటున్న దీపల్లి నరేందర్‌రెడ్డి(27) సోమవారం రాత్రి అద్దె ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా మేడికొండకు చెందిన దీపల్లి నరేంద్రరెడ్డి మూడేళ్ల కిందట ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అమ్మాయిని వివాహం చేసుకొని ఏడాదిన్నరగా టీచర్స్ కాలనీలో ఉంటున్నట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మద్యం మత్తులో ఉరేసుకొని ఉంటాడని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు వికారాబాద్ నుంచి వచ్చాక వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

స్తంభానికి కట్టేసి కొట్టారని ఏడుగురిపై కేసు



శివ్వంపేట, న్యూస్‌టుడే: వ్యక్తిని స్తంభానికి కట్టేసి దాడి చేసిన ఏడుగురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. శివ్వంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన కమ్మరి కృష్ణ ఈనెల 1న తను స్నానాల గదిలో ఉండగా చూశాడని ఓ మహిళ.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మరుసటి రోజు ఇంట్లో పడుకొని ఉండగా మహిళ కుటుంబ సభ్యులు బయటికి లాక్కొచ్చి స్తంభానికి కట్టేసి కర్రలతో కొట్టారని కృష్ణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మహిళతో పాటు ఏడుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

సంచికి దూరం.. సృజనకు చేరువ

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో సంచికి దూరం కార్యక్రమం మంగళవారం ముగిసిందని, పిల్లల్లో సృజనాత్మకత పెంచడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించామని ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు రంగులద్దడం, ముగ్గులు వేయడం, క్రీడలు, సంచుల తయారీ, కుట్టు మిషన్ లో మెలకువలు, నర్సరీలో మొక్కలు పెంచడం, కూరగాయల సాగు, వీణ, వయోలిన్ వాయిండచం, తదితర అంశాల్లో మెలకువలు నేర్పించామన్నారు. విద్యాలయ పూర్వ విద్యార్థి డాక్టర్ సాయినాథ్ రెడ్డి పలు సూచనలిచ్చారు.



ఫ్లూట్, వయోలిన్ వాయిస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ రాజేందర్, ఉపాధ్యాయ బృందం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

పోలీసుల అదుపులో ఆరుగురు ● నాలుగేళ్లుగా 36 చోరీలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీలు శ్రీనివాస్, నర్సింహ

మాదాపూర్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సైబరాబాద్ సీసీఎస్ పోలీసులకు పట్టుబడింది. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు సంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లో 36 చోరీలకు పాల్పడిన రెండు ముఠాలకు చెందిన ఆరుగురు ఘరానా దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఆరు కత్తులతోపాటు కట్టర్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, సైబరాబాద్ క్రైమ్స్ విభాగం డీసీసీ నర్సింహ తెలిపిన వివరాలు.. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా కుక్షి తహసీల్‌లోని ఖనియాంబకు చెందిన కరన్ మనోహర్‌బాబర్, ప్యార్‌సింగ్ బవుల, డెబ్రాబవుల, కడక్‌సింగ్, చిరాడ్‌కు చెందిన రాకూర్ ఈడియ, కుమన్ ఈడియ జల్సాలకు అలవాటు పడి చోరీల బాటపట్టారు. కరన్ మనోహర్‌బాబర్, కడక్‌సింగ్ నేతృత్వంలో రెండు ముఠాలుగా ఏర్పడి తెలుగు రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్నారు.

ఆయుధాలతో సంచరిస్తూ..

గతనెల 19, 20, 21వ తేదీల్లో మియాపూర్, బాచుపల్లి, సూరారం, పేట్‌బషీరాబాద్ ఠాణాల పరిధుల్లో చోరీలకు పాల్పడ్డారు. సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీఎస్ మాదాపూర్, సీసీఎస్ బాలానగర్ జోన్ బృందం పోలీసుల సహకారంతో దర్యాప్తు చేపట్టారు. సోమవారం కరన్ మనోహర్‌బాబర్ బృందంతో కలిసి మియాపూర్‌లో ఆయుధాలు, కట్టర్లున్న సంచులతో సంచరిస్తూ పట్టుబడ్డారు. కడక్‌సింగ్ ముఠా వివరాలు చెప్పడంతో పోలీసులు అందరినీ అదుపులోకి తీసుకున్నారు.

మరో 8 మంది పరారీ..

రెండు ముఠాలకు చెందిన సమర్‌సింగ్, మోహన్, అర్జున్, దయాసింగ్, కైలాష్, ఛురియా, సొత్తు కొంటున్న రోహిత్‌సోని, గౌరవ్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

గుంతలో పడి వ్యక్తి మృతి



లక్ష్మయ్య

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వస్తూ రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కౌడిపల్లి మండలం కొత్తచెరువు తండా గ్రామ పంచాయతీ మొండితండా వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట గ్రామానికి చెందిన చీమల లక్ష్మయ్య(49) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై వస్తుండగా.. మొండి తండా వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో పడిపోయాడు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిషన్‌నాయక్ గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. కుటుంబీకులు వచ్చి లక్ష్మయ్యను ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు నవీన్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. లక్ష్మయ్యకు భార్య భూదెమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

రాయపోల్, న్యూస్‌టుడే: బైక్‌పై వెనుక కూర్చున్న మహిళ రోడ్డుపై పడగా.. ఆమె పైనుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాలు... గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన రాసమల్ల సూరమ్మ (60) వారి వియ్యంకుడి మూడో రోజు కర్మ కార్యక్రమంలో పాల్గొనడానికి రాయపోల్ వెళ్లింది. తర్వాత రాత్రి జాలిగామకు చెందిన రమేశ్ బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె కింద పడింది. అదే సమయంలో వచ్చిన గుర్తు తెలియని వాహనం పైనుంచి వెళ్లగా తీవ్రగాయాలతో చనిపోయింది. ఆమె భర్త రాములు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తపస్ జిల్లా అకడమిక్ కమిటీ నియామకం

మెదక్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అకడమిక్ సెల్ కమిటీ కన్వీనర్‌గా అనిల్‌గౌడ్, జిల్లా కో-కన్వీనర్లుగా ప్రసాద్‌రెడ్డి, శంకర్‌సింగ్ రాథోడ్ ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

చార్లెస్ వాకర్ పాస్నెట్ సేవలు చిరస్మరణీయం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ సీఎస్ఐ చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ పాస్నెట్ సేవలను గుర్తు చేసుకోవలసిన అవసరం ఎంతో ఉందని ప్రైవేట్ చర్చి బిషప్ గుండా దాస్ ఎల్లం అన్నారు. ఆయన తన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మెదక్ పట్టణం సండే స్కూల్ భవనంలో సేవకరత్న పేరుతో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ, అడ్వైజరీ కమిటీ, జిల్లాలోని 21 మండలాల అధ్యక్షులను, సంఘ సేవకులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. మెదక్ ప్రెసిబిటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, చర్చి కమిటీ బాధ్యుడు సంపత్, సిహెచ్ విజయ్ కుమార్, జీవరత్నం, నెల్సన్, హెండ్రిపాల్, ఏసుబాబు తదితరులున్నారు.

అసంపూర్తి భోజనశాలలు.. ఇబ్బందుల్లో విద్యార్థులు

న్యూస్‌టుడే, వెల్దుర్తి, శివ్వంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కోసం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇంత వరకు బాగానే భోజనం చేయడానికి అనువైన స్థలం లేక విద్యార్థులు ఆరుబయట, తరగతి గదులు, వరండాల్లో భోజనం చేస్తున్నారు. గాలి దుమారం, వర్షం కురిస్తే భోజనం చేయలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకం కింద పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భోజనశాలల నిర్మాణం చేపట్టింది. చాలా పాఠశాలల్లో భోజనశాల నిర్మాణం పూర్తయిన గుత్తేదార్లు వాటిని అప్పగించలేదు. పలు పాఠశాలల్లో నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. చేసిన వాటికి బిల్లులు రాక, అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని గుత్తేదార్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి అసంపూర్తి నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు దూరం చేయాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాంబండ ఉన్నత పాఠశాలలో..

ఆయాచోట్ల పరిస్థితి: ఉమ్మడి వెల్దుర్తి మండలంలో వెల్దుర్తి, కుకునూర్, మంగళపర్తి, మాసాయిపేట, కొప్పులపల్లి ఉన్నత పాఠశాలలకు భోజనశాలలు మంజూరయ్యాయి. కొప్పులపల్లి ఉన్నత పాఠశాలలో స్థలం కొరత ఉండడంతో కింద భోజనశాల, పైన తరగతి గదులు నిర్మించారు. దీంతో బిల్లులు రాకపోయిన విధిలేక గుత్తేదారు భోజనశాలను, తరగతి గదులను పాఠశాలకు అప్పగించారు. కొప్పులపల్లిలో భోజనశాల వినియోగిస్తున్నారు. వెల్దుర్తిలో, కుకునూర్‌లో నిర్మాణాలు పూర్తయిన గుత్తేదార్లు అప్పగించకపోవడంతో వృథాగా ఉన్నాయి. మాసాయిపేటలో పిల్లర్లు నిర్మించి పైన రేకులు ఏర్పాటు చేసి వదిలేశారు. మంగళపర్తిలో పిల్లర్లు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. ఈ దసరా సెలవుల్లోనైనా నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.

● శివ్వంపేట మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలకు భోజనశాలలు మంజూరు కాగా కేవలం చిన్నగొట్టిముక్లలో మాత్రమే నిర్మాణం పూర్తయి వినియోగిస్తున్నారు. పాంబండ, దొంతి ఉన్నత పాఠశాలల్లో బిల్లులు రాక గుత్తేదార్లు అసంపూర్తిగా వదిలేశారు. శివ్వంపేట, గోమారం, చండి, కొంతాన్‌పల్లి పాఠశాలల్లో నిర్మాణం పూర్తయిన గుత్తేదార్లకు బిల్లులు అందక వృథాగా వదిలేశారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు.


మాసాయిపేట ఉన్నత పాఠశాలలో..

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం:

నిధుల కొరత, గుత్తేదార్లకు బిల్లులు రాకపోవడం వల్ల పాఠశాలల్లో భోజనశాలల నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయాయి. పూర్తయినవి గుత్తేదార్లు అప్పగించక వృథాగా ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయి పాఠశాలలకు అప్పగించిన భోజనశాలల్లో అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు వినియోగిస్తున్నారు. అసంపూర్తి నిర్మాణాల విషయమై అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– పవన్, పీఆర్ ఏఈ, వెల్దుర్తి,
సునీత, నీటిపారుదల శాఖ ఏఈ, శివ్వంపేట

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట 80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట 94402 31031
తూప్రాన్	96762 58144	(10AM TO 1 PM)
చేగుంట	80085 73200	

న్యూస్‌టుడే, వెల్దుర్తి, అల్లాదుర్గం: ? వెల్దుర్తి మండలం వర్దవాని చెరువు తండా నుంచి చెర్లపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలమై కాలినడకన వెళ్లలేని దుస్థితి. రోడ్డు మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగించాలి. – **పోచయ్య, చెర్లపల్లి**

✔ రోడ్డు శిథిలమైనది వాస్తవం. రీబీటీకి అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తాం. రాగానే పనులు ప్రారంభిస్తాం. – **పవన్, పీఆర్ ఏఈ, వెల్దుర్తి**

? అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. – **రమేష్, గడిపెద్దాపూర్**

✔ ఇప్పటికే రైతులు సమస్య తమ దృష్టికి తీసుకువచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుని పరిష్కరిస్తాం.

– శివాజీ, ఏఈ విద్యుత్తు శాఖ, అల్లాదుర్గం

నామినేటెడ్ పదవుల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి

పాపన్నపేట, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ, వ్యవసాయ విపణి ఛైర్మన్ పదవుల్లో ముదిరాజ్‌లకు అవకాశం ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ అన్నారు. మంగళవారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు ఏడుపాయల ఆలయ ఛైర్మన్‌గా అవకాశం ఇవ్వాలన్నారు. సంఘం మండలాధ్యక్షుడు కిష్టయ్య, యువజన సంఘం మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు గణేష్, వెంకటేష్, రమణ, దుర్గేశ్, తదితరులున్నారు.

గ్రంథాలయాల బలోపేతానికి కృషి చేస్తా

నర్సాపూర్, న్యూస్‌టుడే: జిల్లాలో గ్రంథాలయాలను విజ్ఞాన భాండాగారాలు మార్చడంతో పాటు బలోపేతం చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుహాసినిరెడ్డిని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి ఘనంగా సన్మానించారు. బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, పార్టీ మండల, పట్టణాధ్యక్షులు మల్లేశం, అంజిగౌడ్, నాయకులు సురేష్, అజ్మత్, ఉదయ్ తదితరులున్నారు.

వైభవంగా అట్ల బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ సంబురాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అట్ల బతుకమ్మ వేడుకలను మహిళలు, యువతులు కోలాటం ఆడుతూ ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో ప్రత్యేకంగా అలంకరించిన బతుకమ్మలకు పూజలు చేసి, ప్రధాన కూడళ్లలో ఉంచి ఆడిపాడారు. చేగుంట, నార్సింగి మహిళలు శ్వేత వర్ణం చీరలు కట్టుకొని బతుకమ్మ ఆడారు. చిన్నబతుకమ్మ పోయిరావమ్మా సాగనంపారు. అనంతరం నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. అల్లాదుర్గం, టేక్మాల్, కౌడిపల్లి, పెద్దశంకరంపేట మండలాల్లోనూ బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం


రేగోడ్‌లో అట్ల బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పెద్దశంకరంపేటలో ..


టేక్మాల్‌లో..


కౌడిపల్లి హనుమాన్ ఆలయం వద్ద ..

ఇంటి తాళాలు పగులగొట్టి ఆభరణాల చోరీ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఘటన వెల్దుర్తిలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి సాయికుమార్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వేరే గ్రామంలో బంధువుల వద్దకు వెళ్లారు. మంగళవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా బద్దలు కొట్టి, దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దొంగతనం జరిగినట్లు గుర్తించి వెల్దుర్తి ఠాణాలో ఫిర్యాదు చేయగా ఎస్సై సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. 4.5 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.4వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు సాయికుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కార్లు ఢీకొని పలువురికి గాయాలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా కార్లు ఢీకొని పలువురికి గాయాలైన ఘటన మండల పరిధి మహ్మద్‌నగర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్‌చెడ్ మండలం రాందాసుగూడకు చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళుతుండగా మెదక్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కార్ల ముందు భాగాలు బాగా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో ఆంజనేయులు, విష్ణువర్ధన్, గాయత్రి, లావణ్య, మరో కారులో చిదానందం మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక 108-వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాత పింఛన్ విధానమే మేలు

ములుగు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ శర్మ అన్నారు. మంగళవారం మార్కుక్‌లో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాత పింఛన్ విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

నర్సాపూర్, కౌడిపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 40మందికి రూ.18,35,400ల విలువైన ఎల్వోసీ పత్రాలను రాజిరెడ్డి బాధితులకు పంపిణీ చేశారు. శివ్వంపేట ప్యాక్స్ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి సయ్యద్‌పాష ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయండి


సీసీ పనులు ప్రారంభిస్తున్న పుర ఛైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన టీయూఎఫ్ఐడీసీ, ప్రత్యేక అభివృద్ధి నిధులను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేయడం లేదని పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆరోపించారు. పట్టణంలోని 11వ వార్డులో మంగళవారం సీసీ రహదారి పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం నిధుల కేటాయింపు తాత్కాలికంగా ఆపేయడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. పురపాలికకు నిలిపివేసిన రూ.55.95కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కౌన్సిలర్ రాజేందర్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు మురళీ తదితరులున్నారు.

మహాచండిగా దుర్గామాత దర్శనం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయాలు, పట్టణ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారు మహాచండి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చిట్కుల్ చాముండేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పూజలు చేశారు. మెదక్, నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, హవేలిఘనపూర్, చిన్నశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్, చేగుంట, నార్సింగి, మాసాయిపేట, వెల్దుర్తి, పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాల్లో వేడుకలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం



గడిపెద్దాపూర్‌లో..


టేక్మాల్‌లో దుర్గాదేవిగా


కొర్విపల్లిలో


వెల్దుర్తి వేంకటేశ్వరాలయంలో దుర్గాస్వాములు..


తూప్రాన్‌లో వంటేరు ప్రతాప్‌రెడ్డి


జక్కన్నపేటలో..

దాడిచేసిన వారిపై కేసు

శివ్వంపేట, న్యూస్‌టుడే: దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లికి చెందిన ఆగం శ్రీనివాస్ ఈ నెల 6న సాయంత్రం మేకల్ని కొట్టంలో ఉంచి, పొలంలోకి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూడగా మేక కనిపించలేదు. మేక కోసం శివ్వంపేట మండలం చాకరిమెట్ల వైపు వచ్చి వెతుకుతూ ఉండగా అతని ఇద్దరు కుమారులు ప్రవీణ్, నవీన్ వారి మిత్రుడు సురేష్ ఎదురు పడగా మేక గురించి వాకబు చేశారు. మేమే అమ్ముకున్నాం అంటూ దూషిస్తూ తనతో పాటు వచ్చిన వారిపై కర్రలతో దాడిచేశారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సాంకేతిక లోపం..త్రుటిలో తప్పిన అపాయం



బోధన్-మెదక్ ప్రధాన రహదారిలో ప్రయాణికులతో వస్తున్న ఆటో మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో రాగానే అకస్మాత్తుగా ఇంజిన్‌లో సాంకేతిక సమస్యలతో ఆగిపోయింది. దీంతో పాటు తీవ్రమైన పొగ వెలువడడంతో రోడ్డుపైన వస్తున్న వాహనాలు కనిపించ పోయాయి. దీంతో కొన్ని వాహనాలు అక్కడే నిలిపివేయగా వెనుక నుంచి వచ్చే వాహనాలు ముందు ఉన్న వాహనాలను ఢీకొట్టాయి. దీంతో మూడు వాహనాలు కొంతమేర ధ్వంసమయ్యాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అతి వేగంగా వాహనాలు వస్తే ప్రమాదం తీవ్రత ఎక్కువ ఉండేదని ప్రయాణికులు, వాహనచోదకులు తెలిపారు. – మెదక్ టౌన్, న్యూస్‌టుడే

వృత్తివిద్య శిక్షణతో ఉపాధి

చేగుంట, న్యూస్‌టుడే: వృత్తివిద్యా కోర్సులను నేర్చుకుంటే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని చేగుంట ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రకళ అన్నారు. ఆదర్శ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు దసరా సెలవుల్లో వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. పాఠశాలలో ఒకేషనల్ కోర్సు ఉందని అందులో చదువుతున్న వారికి శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు రఘు మోహన్ ఉన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్



నర్సాపూర్ పట్టణంలోని 15వ వార్డులో అంతర్గత మురుగు కాల్వలపై మ్యాన్‌హోల్స్ పైకప్పులు లేక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. మురుగు కాల్వల నిర్మాణం చేపట్టిన పురపాలిక అధికారులు వాటిపై అవసరమైన చోట పైకప్పులు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. పైకప్పులు ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. ఇళ్ల ముందర నోళ్లు తెరచి ఉండటంతో పిల్లలు, రాత్రిపూట పెద్దలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆయా వార్డుల్లో మురుగు కాల్వలపై దశలవారీగా పైకప్పులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 130 వరకు గుర్తించి వాటిలో 35 వరకు పూర్తి చేసినట్లు చెప్పారు. వీలైనంత త్వరలో మిగతా వాటిపై కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, నర్సాపూర్

అనుసంధాన దారి..అధ్వానంగా మారి



అంతర్ జిల్లాను కలుపుతూ ఏళ్ల క్రితం చేపట్టిన ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుస్థితి నిజాంపేట మండల పరిధి కల్వకుంట నుంచి సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం కాజీపూర్ వెళ్లే రహదారిలో నెలకొంది. దశాబ్దం క్రితం రెండు గ్రామాలను కలుపుతూ నాలుగు కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పూర్తిగా తారు లేచిపోయి కంకర మాత్రమే దర్శనమిస్తుంది. గుంతలపై రోడ్డుపై వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రామాయంపేట

ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోండి


దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకునేందుకు అన్ని మండలాల్లో సహాయ కేంద్రాలను ప్రారంభించినట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఫారం-18 సంబంధిత కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని నవంబరు 6లోపు ఓటు హక్కు నమోదుకు అవకాశం ఉందన్నారు. 2021 నవంబరు 1 లోపు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారు మాత్రమే పట్టభద్రుల ఓటు హక్కు నమోదుకు అర్హులన్నారు. డిసెంబరు 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు.

కార్మికులకు బోనస్ చెల్లించాలి

మనోహరాబాద్, న్యూస్‌టుడే: కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులకు దసరా పండగను పురస్కరించుకుని బోనస్‌లు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మనోహరాబాద్‌లో ఆయన మాట్లాడారు. పరిశ్రమ లాభాల్లో 8.33 శాతం నుంచి 20 శాతం వరకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికి రూ.7వేల చొప్పున బోనస్ చెల్లించేలా కార్మిక శాఖ అధికారులు పరిశ్రమ యజమానులను ఆదేశించాలన్నారు.

సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్ల పరిశీలన

తూప్రాన్: తూప్రాన్ పెద్దచెరువు కట్టపై గురువారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రవీందర్ గుప్తా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భాజపా సభ్యత్వ నమోదు

కొల్చారం, అల్లాదుర్గం, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలో రంగంపేట 63, 64, 65 బూత్‌లలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. బూత్ అధ్యక్షులు గిరి, గంగరాజు, పోచేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అల్లాదుర్గం మండలం చేవెళ్ల, బహిరన్ దిబ్బలో పార్టీ గ్రామ అధ్యక్షులతో పార్టీ మండలాధ్యక్షుడు యాదగిరి, జిల్లా నాయకులు బ్రహ్మం సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు సంగమేశ్వర్, హనుమంతు, శ్రీకాంత్ తదితరులున్నారు.

హరియాణా గెలుపుపై హర్షం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రంలో మూడోసారి భాజపా అధికారంలోకి రావడంపై ఆ పార్టీ పేట మండల అధ్యక్షుడు కోనం విఠల్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పేట పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భాజపాతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు మరోసారి రుజువు చేశారన్నారు. శ్రావణ్‌కుమార్, కృష్ణ తదితరులున్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా భక్తులు భవానీ మాలధారణ చేపడతారు. ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నిలిపి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. గ్రామానికి చెందిన ఇర్ఫాన్‌తో పాటు తన మిత్రులు మంగళవారం అన్నప్రసాద వితరణ చేసి స్వయంగా వారే మాలధారులు, భక్తులకు భోజనం వడ్డించారు. దీంతో పలువురు అభినందించి ఇదే పద్ధతి కొనసాగించాలని సూచించారు.

బోరు మోటారు ఏర్పాటు..తీరిన నీటి సమస్య

శివ్వంపేట, న్యూస్‌టుడే: దంతన్‌పల్లిలో నీటి సమస్య పరిష్కారానికి శివ్వంపేట సహకార సంఘం ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి రూ.30వేలతో మంగళవారం బోరు మోటారు ఏర్పాటు చేసి ప్రారంభించారు. నీటి సమస్య తీరడంతో గ్రామస్థులు ఛైర్మన్‌ను అభినందించారు.

రహదారులపై సూచికలు ఏర్పాటు చేయరూ!

న్యూస్‌టుడే, శివ్వంపేట: జాతీయ రహదారిపై, ప్రమాదకరంగా మారిన వంతెనల వద్ద సూచికలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకు వంతెనల వద్ద సూచికలపై మొక్కలు, పొదలు అల్లుకుని సూచికలు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గాల్లో కొత్తగా వచ్చేవారు సూచికలు కనిపించక వాహనాలు వేగంగా నడపడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకుని సూచికలు ఏర్పాటు చేయించి, ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి: శివ్వంపేట మండలం నర్సాపూర్-తూప్రాన్ 161ఏఏ జాతీయ రహదారిపై ఇరుకు వంతెనలు ప్రమాదకరంగా మారాయి. దీంతో గతంలో సూచికలు ఏర్పాటు చేశారు. సుమారు 20 కి.మీ రహదారిని కొన్నేళ్ల కిందట రెండు వరుసల రోడ్డుగా విస్తరణ చేశారు. విస్తరణ చేసిన పలుచోట్ల వంతెనలు మాత్రం విస్తరించ లేదు. దీంతో అవి ఇరుకు వంతెనలుగా మారాయి. పలుచోట్ల సూచికలు తొలగిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో రహదారి పక్కన సూచికలు కనిపించడం లేదు. కొత్తగా వచ్చే వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. అక్కడక్కడ రోడ్లపై చిన్నచిన్న గుంతలు ఏర్పడ్డాయి. వాటికి మరమ్మతులు చేస్తే ప్రమాదాలను నివారించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. సూచికల వద్ద పొదలు, పిచ్చి మొక్కలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


చాకరిమెట్ల వంతెన వద్ద..

పొదలు తొలగిస్తాం: రామకృష్ణ, ఎన్‌హెచ్ డిప్యూటీ ఈఈ, సంగారెడ్డి

సంగారెడ్డి-నర్సాపూర్, శివ్వంపేట-తూప్రాన్ 161ఏఏ జాతీయ రహదారిలో సూచికలకు అడ్డుగా పెరిగిన పొదలు, మొక్కలను తొలగిస్తాం. సూచికలు తొలిగిపోయిన చోట తిరిగి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతాం. రహదారిపై గుంతలకు మరమ్మతులు చేయించి, ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం.